# నీ పేదరికం ఎరిగిన దేవుడు

( ప్రకటన 2:9 నీ శ్రమను దరిద్రతను నేనెరుగుదును, అయినను నీవు ధనవంతుడవే.)

## ఉపోద్ఘాతం:

పేదరికం, లేమి, ఆర్థిక ఇబ్బంది, రుణ భారం విశ్వాసుల హృదయాలను క్రుంగజేసి విశ్వాసంను దిగజార్చి వేయును. పేదవారుగా ఉన్న విశ్వాసులు ఆశించవలసినది వస్తువులు, డబ్బు కాదు గాని ఆధ్యాత్మిక విషయాలలో ధనికులై ఉండాలని ఎప్పుడు కోరుకోవాలి.

పై వాక్యం మనం గమనించి నట్లైన ఈ లోక సంబంధమైన విషయాల్లో స్ముర్ణ సంఘంవారు పేదవారిగా ఉన్నాగాని ఆధ్యాత్మిక విషయాల్లో పరలోక విషయాల్లో వారు ధనవంతులుగా ఉండి ప్రభువు మెప్పును పొందుకున్నారు.

పేదరికంలోనే శాంతి సమాధానం ఉన్నదని గ్రహించాలి. ఈ సత్యాన్ని గ్రహించిన మాసిదోనియా వారు తమ సంపదను దేవుని సేవకొరకు ఇచ్చినందున పౌలు భక్తుడు వారిని ఎంతో కొనియాడాడు. (2 కొరి 8:2 ఏలాగనగా, వారు బహు శ్రమవలన పరీక్షింపబడగా, అత్యధికముగా సంతోషించిరి. మరియు *వారు నిరుపేదలైనను వారి దాతృత్వము బహుగా విస్త రించెను. )

పరిశుద్ధ గ్రంథం పేదరికం గురించి ఏమి చెప్పుచున్నదో ఒక చిన్న పరిశీలన చేద్దాం.

## 1. పేదరికానికి కారణం దేవుడు కాదు

ఈ అంత్యదినాలలో పేదరికం అనేది అనేకులను పీడిస్తూ ఉన్నది. తమకు పేదరికానికి రావడానికి కారణం దేవుడని చెప్పి అనేకులు దేవుని దూషించువారుగా ఉన్నారు. పరిస్థితులు అనుకూలంగా లేక ఏదైనా నష్టం సంభవించి పేదరికం వస్తే, దానికి కారణం దేవుడని చెప్పి దేవుని దూషించడం అంత బుద్ధితక్కువ పని మరొకటి లేదు.

సాతాను వలన యోబు పేదవాడైనప్పుడు యోబు భార్య దేవుని దూషించమని తన భర్తను శోధిస్తూ ఉన్నది.

(యోబు 2:9 అతని భార్య వచ్చినీవు ఇంకను యథార్థతను వదలక యుందువా? దేవుని దూషించి మరణము కమ్మనెను.) కరవు కాలంలో దేవుని మీద ఆధార పడకుండా దేవుని నమ్మకుండా లోకాన్ని నమ్మి మోయాబుకు వెళ్లి భర్తను బిడ్డలను కోల్పోయిన నయోమి, తన పేదరికానికి, రిక్తహస్తాలతో తాను నిలబడటానికి దేవుడే కారణమని దేవుని నిందిస్తూ ఉన్నది. ఎంత విచారకరం. (రూతు 1:21 నేను సమృద్ధిగల దానవై వెళ్లితిని, యెహోవా నన్ను రిక్తురాలినిగా తిరిగి రాజేసెను.)

## 2. పేదరికంతో నష్టం కలుగ జేసేది సాతాను

నీవు నష్టపోవడానికి పేదవాడిగా మారుటకు కారణం సాతాను గాని దేవుడు కాదు గదా. నిన్ను నష్టపరచి నాశనం చేసేది సాతాను అని గ్రహించాలి. యోబు యొక్క సమస్త సంపదను హరించివేసి యోబును పేదవాడిగా జేసినది సాతానే.

కొన్ని సార్లు పేదరికం అనేది ఒక పరీక్షగా కూడా మన జీవితంలో రావచ్చు. ఆస్తిమీదికి ఏదైనా విపత్తును రానిచ్చి వారిని పేదవారిని చేస్తే దేవుని మంచితనం మీద నమ్మకాన్నీ భక్తిభావాన్నీ పోగొట్టుకుంటారని సాతాను అభిప్రాయం. అందుకే సాతాను యోబుకు ఉన్న సమస్తాన్ని నాశనం చేసి శరీరాన్ని కురుపులతో మొత్తాడు. (యోబు 2:7)

తన చేతిలో పడిన ఆస్తిపాస్తులకూ మనుషులకూ ఏ గతి పడుతుందో సైతాను ఇక్కడ వెల్లడి చేస్తున్నాడు. వాడు నాశనకారి, హంతకుడు (యోహాను 10:10)

## 3. నీ పేదరికాన్ని ఎరిగిన దేవుడు

ప్రియ దేవుని బిడ్డా! నీ పేదరికాన్ని బట్టి క్రుంగిపోవడం మంచిది కాదు. దేవుడు నీ పేదరికాన్ని ఎరిగిన దేవుడుగా ఉన్నాడు. స్ముర్న సంఘం వారు పేదవారుగా ఉండి ప్రభువును నమ్ముకున్నారు. మరి కొంతమంది స్ముర్న సంఘపు క్రైస్తవులు తమ ధనమంతా ప్రభుసేవలో వాడి పేదవారయ్యారు. స్ముర్న సంఘంలోని కొందరు క్రీస్తును

అనుసరించేందుకు ఇష్టపూర్వకంగా కావాలని తమ ఆస్తిని వదలిపెట్టి తమ్మును తాము పేదలనుగా చేసుకుని సువార్తను నమ్ముకున్నారు. (ప్రక 2:9 నీ శ్రమను దరిద్రతను నేనెరుగుదును, అయినను నీవు ధనవంతుడవే.)

ఈ సమాజం పేదలను తక్కువవారిగా చూచినా ధనం లేదని మనుష్యులు వారిని వెలివేసినా దేవుని దృష్టిలో పేదవారు ఎంతో ధన్యులు అని గ్రహించాలి. (లూక 6:22 మనుష్య కుమారుని నిమిత్తము మనుష్యులు మిమ్మును ద్వేషించి వెలివేసి నిందించి మీ పేరు చెడ్డదని కొట్టివేయు నప్పుడు మీరు ధన్యులు.)

## 4. పేదవారి యొక్క ధన్యత

(లూకా 6:21 ఇప్పుడు అకలి గొనుచున్న మీరు ధన్యులు, మీరు తృప్తి పరచబడుదురు. ఇప్పుడు ఏడ్చుచున్న మీరు ధన్యులు, మీరు నవ్వుదురు.) దేవుని దృష్టిలో పేదవారికే ఎప్పుడు ప్రధమ స్థానం ఉంటుంది. పేదలకు దేవుడు తండ్రిగా  ఉన్నాడు గనుక పేదలు ధన్యులు. (యోబు 29:16)

బీదలకు సువార్త ప్రకటించుటకే తాను వచ్చానని యేసు చెప్పాడు గనుక బీదలు ధన్యులు. (లూకా 4:18 ప్రభువు ఆత్మ నామీద ఉన్నది బీదలకు సువార్త ప్రకటించుటకై ఆయన నన్ను అభిషేకించెను)

## 5. పేదవారు విశ్వాసంలో ధనవంతులు

(యాకోబు 2:5 నా ప్రియ సహోదరులారా, ఆలకించుడి; ఈ లోక విషయములో దరిద్రులైన వారిని విశ్వాసమందు భాగ్య వంతులుగాను, తన్ను ప్రేమించువారికి తాను వాగ్దానము చేసిన రాజ్యమునకు వారసులుగాను ఉండుటకు దేవుడేర్పరచు కొనలేదా?) ఒకవేళ మనం పేదవారమైతే, నిరుత్సాహ పడకూడదు. దేవుడు పేదవారిని విశ్వాసంలో ధనవంతులుగా చేశాడని వారు సంతృప్తి చెందాలి. పేరుకు పేదవారైనాగాని విశ్వాసంలో వారు ధనవంతులుగాను తన రాజ్య వారసులుగాను ప్రభువు చేస్తాడు.

కాబట్టి ప్రియ దేవుని బిడ్డలారా! పేదవారమైనంత మాత్రాన మనం ఎవరికంటే కూడా తక్కువకాదు. కాబట్టి బాధపడవలసిన పని లేదు. పేదవారందరూ దేవుని దృష్టిలో ధనవంతులే. మనము ఇంకా "ఆధ్యాత్మికంగా ధనవంతులుగా" మరియు అందరి క్రైస్తవులతో సమానంగా ఉండగలము. పేదరికమే మనలను దేవునికి దగ్గరగా చేస్తుంది. పేదలైన వారిని ఆకలితోనున్న వారిని దేవుడు తృప్తి పరుస్తాడు.హృదయంలో క్రీస్తులేని వాడే నిజమైన పేదవాడు. పేరుకు యోబు పేదవాడైన విశ్వాసంలో ధనవంతుడుగా ఉన్నాడు. (యోబు 2:10).

## 6. పేదవారి చివరి స్థానం అబ్రహాము రొమ్ము

లాజరు పేరుకు పేదవాడైన దేవుని దృష్టిలో గొప్ప ధనవంతుడు కనుకనే లాజరు అబ్రహాము రొమ్ముకు చేర్చబడ్డాడు. (లూకా 16:22 ఆ దరిద్రుడు చనిపోయి దేవదూతల చేత అబ్రాహాము రొమ్మున (ఆనుకొనుటకు) కొనిపోబడెను. ధనవంతుడుకూడ చనిపోయి పాతిపెట్టబడెను.)దేవుడు మనలను పేదవారిగా ఎందుకు చేశాడో చూస్తే, మనం విశ్వాసంలో ధనవంతులుగా ఉన్నత దశలో ఉంచుటకే అని మనం గ్రహించాలి. ఆ భాగ్యకరమైన విశ్వాసమే పేదవారి పాలిట నిజమైన దైవ దీవెన. లాజరు పూర్తిగా దిక్కులేని నిరుపేద. కానీ అతనికి సహాయం చేసేందుకు ధనికుడు చిటికెన వేలైనా కదల్చలేదు. ఈ విధంగా అతడు తన స్వార్థపరత్వం, హృదయ కాఠిన్యతను కనపరచు కున్నాడు. ఆ భయంకరమైన నరకంలో యాతన పడుచున్న ఆ ధనవంతునికి లక్షలాది రూపాయల ఆస్తి ఈ లోకంలో ఉన్నా గాని ఆ ధనం అంతా అతనికి ఒక్క నీటి బొట్టును కూడా నరకంలో ఇవ్వలేక పోయింది.

## 7. పేదవారిని ధనికులుగా చేయునది దేవుడే

ప్రభువు తన దయాసంకల్పం చొప్పునే పేదలను ధనికులను చేస్తాడు. వారు చేయవలసిన దేవుని కార్యాలపై ఇది ఆధారపడి యున్నది. తమ అనుదిన జీవితం దేవుని మీద పూర్తిగా ఆధారపడి ఉందని గుర్తించి, తమ అవసరాలను తీర్చేందుకు నమ్మకంతో ఆయనవైపే చూడాలని పేద విశ్వాసులు తెలుసుకోవాలి. (మత్తయి 6:32 ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపు తండ్రికి తెలియును. 33 కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింపబడును).

దేవుడు క్రీస్తులో నమ్మకముంచిన పేదలనూ విద్యలేనివారినీ గొప్ప స్థితికి హెచ్చించాడు. వారిని ఆయన తన స్వంత పిల్లలుగా చేసుకుని వారిని ఒక దివ్యమైన భవిష్యత్తుకోసం ఎన్నుకొన్నాడు. పేదలుగా పుట్టిన జాలరులను ప్రపంచాన్ని తల్లక్రిందులు చేసిన ఆది అపోస్తలులుగా వారిని మార్చాడు.

## ముగింపు

క్రీస్తులో ధనికుడని పేదవాడని గానీ దాసుడని యజమాని అని గానీ విద్యావంతుడని విద్యలేనివాడని గానీ తేడా లేదు. అందరూ ఏకమే మరియు సమానమే. (గలతీ 3:28)

ప్రియ దేవుని బిడ్డలారా! ఈ చివరి అంత్య దినాలలో రాకడ సూచనలు కనబడుచున్న ఈ కాలంలో ఇలాంటి తరుణంలో జ్ఞానవంతుడెవడూ ఈ లోక సంపదలు, అధికారం, పదవి కావాలని అడగడు. పేదలైనవారు దీన్ని గుర్తించి మాసిదోనియా వారిని మాదిరిగా తీసుకొని యేసుయందె ఆనందం, సంతృప్తి మనం అనుభవించాలి. పేదలైనవారు విశ్వాసంలో భాగ్యవంతులని తాము ఉన్నత స్థితికి రావడానికి దేవుని యందు విశ్వాసమే దారి అని తెలుసుకోవాలి.

ప్రియదేవుని బిడ్డలారా! మిమ్ములను ఈ లోకమందు ధనవంతునిగా చేయుటకు మీ నిమిత్తం ఆయన దరిద్రుడాయెనుఅను సంగతిని ఎన్నడూ మరువరాదు. (2కొరి 8:9)

ప్రియ దేవుని బిడ్డా! నీవు ఎంత పేదవాడవు అనేది ప్రశ్న కాదుకానీ "విశ్వాసంలో నీవు ఎంత భాగ్యవంతుడవు" అనేదే ముఖ్యం! పేదరికం గురించి అధైర్యపడక క్రీస్తులో నీకున్న గొప్ప భాగ్యాన్ని గుర్తించి ఆత్మీయ జీవితంలో ఆనందంగా ముందుకు కొనసాగు. దేవుడు నిన్ను బహుగా దీవించును గాక! ఆమెన్!!